


**కీర్తిశేషులు: జంపన పెద్దిరాజు**

## టెన్నిస్ ఆడటానికి కాదు చూడటానికి

వందలు, వేలు జనం- కార్లు- స్కూటర్లు- సైకిళ్ళు- పిల్లలు-
పెద్దలు-
ముసలాళ్ళు- అంతా- టెన్నిస్ ఆడటానికి కాదు, చూడటానికి.
స్త్రీ టెన్నిస్- ఆడ టెన్నిస్ (అంటే ఆడపిల్లలాడేది)-
యూనివర్సిటీలో
వందలు, వేలు జనం- ఆడటానికి కాదు, చూడటానికి!

మూడు రోజులనుండి మిస్ టానియా పేరు అంతులేని ఆకాశంలా వుంది. ఒడ్డులేని సముద్రంలా వుంది. టానియాకు నేలపై నడవ బుద్ధికావడం లేదు. కోర్టులో తన నడకలో ప్రతి కదలికను మింగుతూ- కొన్నివేల కళ్ళు, కొన్ని వందల కళ్ళజోళ్ళు.

టానియా టాపులేని కారులా కోర్టులో తిరిగింది. కోడిపుంజులా తల పైకెత్తింది. పైకిలేస్తున్న కెరటంలా వెళ్ళి బాల్ తీసేది.

'ఆటలో అందం వుంది.
నిర్లక్ష్యం వుంది.
తెలివి వుంది.'

మద్రాసుపై రెండు సెట్లు వరసగా తీసుకుని [illegible] రాగానే వచ్చిన కామెంట్స్ ఇవి.

'టానియా, హిపీప్
టానియా జిందాబాద్!'

టానియా బ్యాట్‌కు బాల్ తగలగానే చప్పట్లు సముద్ర కెరటాల్లా విరుచుకుపడుతున్నాయి.

టానియా నవ్వింది.

ఏదో టానిక్ అందరి గుండెల్లో ఒలికింది.

గళ్ళకోట్లు, కళ్ళద్దాలు, రంగురంగుల మేజోళ్ళు, ఆడపిల్లల ముందు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్న వాలంటీర్లు.

అదొక తీర్థం
అదొక సంత

రావణాసురుడి సభలో తోకచుట్టపై బైఠాయించిన హనుమంతుడిలా అంపైర్ యెక్కడో ఆకాశంలో ఒబ్బిడిగా ఆసీనుడై వున్నాడు.

ఆట ముగిసింది.

మహా సముద్రంలా [illegible] జనాన్ని కేంటీన్ కొంత లోపల ఇముడ్చుకొని [illegible] కక్కేసింది. కక్కబడ్డ జనం రోడ్లమ్మట... జనం జనం జనం- జజజజజజ జనం.

టానియా వెయ్యి- గుళ్ళో గంటలా, పూజారి తీర్థంలా ముట్టుకొని వెళ్ళిపోతున్నారు.

ఎదరవరసలో కూచున్న ఆఫీసర్ల అందమైన ఆడ ముఖాలు, అజ్ఞానంలాంటి నల్లద్దాలు పెట్టుకొన్న తెల్ల ఏనుగులు, కారుడ్రైవర్ల కోసం చూస్తూ హుందాగా టానియా నభినందించాయి. ఖరీదయిన మూడు కోట్లు వాళ్ళింటికి రాత్రికి డిన్నర్లకు పిలిచాయి.

"మన సమాజంలో స్త్రీలు వంటయిల్లు వదలి ధైర్యంగా అన్ని రంగాల్లోకి దూకుతున్నందుకు నా కెంతో సంతోషంగా వుంది" టౌన్ మహిళామండలి అధ్యక్షురాలు ఆవేశంతో అంది, లిప్‌స్టిక్ పెదాల్ని కొరుకుతూ పక్కనున్న పెద్దమనిషిని చూసి. ఆయన చిరునవ్వు నవ్వాడు.

టానియా ఆ సాయంత్రం రెండు తప్పనిసరి డిన్నర్లకు అటెండ్ అయింది. మొదటి డిన్నర్‌లో పూర్తిగా భోజనం చేసింది. రెండో డిన్నర్‌లో బలవంతంపై కొంచెం పలావు, రెండు యాపిల్స్, ఫ్రూట్‌సాలడ్ తీసుకుంది- తనకోసం ఏర్పాటుచేసిన డిన్నరులో ఆ మాత్రం పుచ్చుకోకపోతే బావుండదని.


'తిండి కలిగితె కండ కలదోయ్ కండ కలవాడేను మనిషోయ్' అని తన టీమ్‌లో అమ్మాయి నవ్వింది.

మర్నా డెవరో స్టూడెంట్స్ డిన్నర్‌కు పిలిస్తే ఇన్విటేషన్ డిక్లైన్ చేసింది.

వాళ్ళు ఒడలిపోయిన మొహాలతో వెళ్ళిపోయారు.

అప్పుడే పన్నీటిలో కడిగిన మల్లెపువ్వులా ఆ రాత్రి టానియా మంచం మీద వ్రాలింది. నిశ్శబ్దం రాత్రికి పహరా కాస్తూంది. యూనివర్సిటీ టవర్ క్లాక్ కొట్టిన పదకొండు గంటలకు చికాకుపడ్డ నిశ్శబ్దం టానియాకు మత్తుగా మెలకువ తెచ్చింది. ప్రాజెక్టు గేటుల్లా కళ్ళ రెప్పలు తెరిచేసరికి కిటికీ లోంచి వెన్నెల వరదలా ముంచెత్తింది. సాయంత్రం తిన్న యాపిల్స్ గొంతులో బతికున్నట్లు కదుపులో కొండ చిలువ కదుల్తున్నట్లు- వికారం- ఆకారం లేని వికారం- వాంతి [illegible]- లేదు- టానియాకు నిద్ర పట్టడం లేదు.

ఆకాశం, చంద్రుడు, నక్షత్రాలు ఆ ఫేకల్టీ క్లబ్ లాడ్జి కిటికీలోంచి ఏదో కొత్తలోకంలా కనిపించేసరికి కొలంబస్‌లా ఒకసారి కొత్త అనుభవాన్ని చూద్దామని నైట్‌గౌన్ సరిచేసుకొని మెల్లమ్మదిగా బైటకు నడిచింది మిస్ టానియా. టెన్నిస్ ప్లేయర్. చలి మంచు. వెన్నెల నిశ్శబ్దం. రాత్రి పెడుతున్న గురకలా సముద్రం హోరు, మంచు దుప్పటి కప్పుకున్న నిశ్శబ్దం. చేతులూ, తలా, చెవీ ఎక్కడన్నా దాచుకొని కళ్ళతో చూడ బుద్ధి వేసే



వాతావరణం. వులెన్ మఫ్లర్ అందంగా చుట్టుకుని, కోర్టు పక్కగా వున్న సిమెంటు గేలరీపై నిలబడి చేతులు కట్టుకుంది.

స్ట్రీట్ లైట్లని కాపలా పెట్టి

యూనివర్సిటీ అంతా

నిద్రపోతూంది. పగలంతా జనాన్ని టోపీ పెట్టుకుని మేచ్ చూసిన 'లా కాలేజి', ఫాకల్టీ క్లబ్ విశ్రాంతి తీసుకొంటున్నాయ్. అప్లైడ్ ఫిజిక్స్ లేబొరేటరీపై రాడారు తల వంచుకుని కునికిపాట్లు పడుతూంది.,

వాటర్ లేని స్విమ్మింగ్ పూల్ లా

వున్న టెన్నిస్ కోర్టులో.

విరిగిపోయిన కుర్చీలు మధ్య తరగతి జీవితాల్లా వున్నాయి. ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతిబింబాల్లా గొప్పవాళ్ళ

కోసం ప్రత్యేకించబడ్డ సోఫాలు,,

కుర్చీలు మంచు తాగి

నిద్రపోతున్నాయ్. వేదికపై పూలదండల వెనక దాక్కొన్న నాయకుల్లా నీలి రంగు గుడ్డల్లో దాక్కొన్న రెండు తడికలు కోర్టు కిరువైపులా.



శ్రీ జంపన పెద్దిరాజు మరణించే నాటికి భీమవరం కాలేజీలో పనిచేస్తుండే వారు. తెలుగు కథాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ కన్పించి హఠాత్తుగా రాలి పోయిన తోకచుక్క అతను. బతికి వుంటే ఎంతో ఎత్తుకి ఎదిగివుండేవారు. అంత ప్రతిభ కన్పించేది అతనిలో 'ఫెల్ ఫెల్' అతని ప్రతిభకు ఓ చిన్న అద్దం మాత్రమే.

20-10-1970వ తేదీన శ్రీ పెద్దిరాజు మరణించారు.

— ఎడిటర్

వ్యభిచారి వేసుకున్న లిప్‌స్టిక్‌లా స్కోరుబోర్డు తగిలించుకొన్న విల్స్ అడ్వర్టైజ్‌మెంటు.

టానియాకు మనసు చికాకుగా వుంది. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. నిద్రపోతున్నవాళ్ళ ప్రతినిధుల్లాగ అక్కడక్కడ. అప్పుడప్పుడు దూరంగా కేకలు, చిన్న చిన్న మాటలు. టానియా దృష్టి కోర్టుకు కొంచెం దూరంలో వున్న ము ‿ ఆకారాలపై పడింది. ఎడారిలో ఏవో మూడు మోడులు మాట్లాడుకుంటున్నట్లు ఆ గ్రౌండులో ముగ్గురు- అంతలో గట్టిగా దగ్గు.

"పర్లేదు నేవే. ఇదెప్పుడూ వుండేదే..."

"కాసిన్ని నీళ్ళు దొరికితే బావుణ్ణు."

"ఏటి పర్వేదు. పని మానేసి, గూటికి పోక-"

"నీకు తెల్దసే. అప్పుడప్పుడు అలా రగతం పడుతుంటదిలే!"

"ఇంకో పది తట్టయింటది. ఆ కాత్తా పోసేత్తేలంతా కల్సి ఒకేసారి పోవొచ్చు."

మళ్ళీ గట్టిగా దగ్గు.

టానియా వాళ్ళ దగ్గిరగా వెళ్ళింది. సందేహం లేదు. ముగ్గురూ మనుషులే. అందుకు నిదర్శనం వాళ్ళు మాట్లాడుకోవటం. నూనె లేక పోయినా జుట్టుంది. గుడ్డలు చినిగినా శరీరం వుంది. వాళ్ళ మొహాలు వాళ్ళ జీవితాలకు ప్రతిబింబాలు. పెద్ద సైజు కవ్ డ్రాయర్‌లా బిగించి కట్టిన వాళ్ళ చీరలు. చీరలు కాదు చింకి కోకలు. మట్టి అద్దకంతో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న కాళ్ళూ చేతులు, వక్షాలున్నందువల్ల ఆడవాళ్ళు. మనుషులు నిద్రపోతున్న వేళ మట్టి మోస్తున్న జీవాలు.

టానియా పిల్లిలా వాళ్ళ దగ్గిరికెళ్ళింది. మట్టిలో గడ్డ కట్టిన రక్తం చూసింది. మనిషి కక్కిన రక్తం చూసి టానియా మనసు పూర్తిగా పాడయింది.

"ఏమైంది?" అంది ఏమీ అనలేక.

అందరూ హాయిగా నిద్రపోతుంటే ఆ రాత్రి వాళ్ళు మట్టెందుకు మోయాలి? మట్టి మోస్తూ ఆమె రక్తం ఎందుకు కక్కాలి? ఇదంతా టానియాకు కొంచెం బాధ అనిపించింది.

వాళ్ళు లేచి తట్టలు నెత్తిమీద పెట్టుకోబోతున్నారు. చూస్తూ నిలబడితే బావుండదని టానియా సాయం చేయబోయింది. కాని, తనవైపు తట్ట కొంచెం కూడా లేపలేకపోయింది. పవర్-పాక్‌డ్ సర్వీసులికి, పవర్ స్ట్రోక్స్‌కి టెన్నిస్ కోర్టులో తప్పట్లు కొట్టించుకుంది తను! ఆ తట్ట ఆమాత్రం ఎత్తలేకపోవడం అవమానంగా ఫీలయింది.



అనంతపురంలోని శిల్పా బ్యూటీ పార్లర్ ఇటీవల నిర్వహించిన అందాల పోటీలో 'లిటిల్ మిస్ అనంతపూర్'గా ఎన్నికైన యు.కె. శ్రీవాణి

"పర్వేదమ్మా! సదువుకునేవోళ్ళు చేసే పన్లు కావియ్యి. మీరు దేశాన్ని బాగుచేయాలి. మీరు సుఖంగా వుంటేనే మాబోటోళ్ళకు కాత్తంత కూడు గుడ్డా దొరుకుతాది" అంది వాళ్ళలో ఒక మనిషి.

తను టెన్నిస్ ఆడి వాళ్ళకు కూడూ గుడ్డా ఏవిధంగా పెట్టగలదో అర్థం కాలేదు టానియాకు. వాళ్ళు టెన్నిస్ కోర్టు గోతులు పూడవడానికి మట్టి పట్టికెళ్తున్నారు అది చదును చేయాలని. 'లెవెల్' చేస్తే కాని మర్నాడు ప్రేక్షకులకు సౌకర్యంగా వుండదని సాయంత్రం ఆర్గనైజర్లు తీర్మానించారు.

తను చూస్తుండగానే వాళ్ళు ముగ్గురూ తట్టలెత్తుకుని వెళ్ళిపోయారు. కష్టాల్లా వెళ్తున్నవాళ్ళను చూస్తూ టానియా ఎప్పుడూ లేని ఆలోచనల్లో పడింది.

వాళ్ళూ స్త్రీలే. బరువులు మోయడంలో వాళ్ళకు గొప్ప ప్రావీణ్యం వుంది. పైగా అర్థరాత్రి చలిలో నిద్రలేకుండా రక్తం కక్కుకుంటూ అలా బరువులు మోయడం సామాన్యమైన విషయం కాదు. తను కాస్త నేర్పుతో టెన్నిస్ ఆడుతున్నందుకే, నిక్కరుతో అంత మంది ముందు నిల్చున్నందుకే అన్ని కార్లు, అన్ని కళ్ళజోళ్ళు, అంత గందరగోళం! మరి అర్ధనగ్నంగా తట్టలు మోసే వీళ్ళని గురించి ఆ కార్లూ, ఆ కోట్లూ, ఆ మైక్‌లు తప్పట్లు కొట్టవేం? డిన్నర్‌కు పిలవ్వేం? ఆవిడెవరో 'స్త్రీలు వంటింట్లోంచి ధైర్యంగా బైటకు వస్తున్నా' రంది. యూనివర్సిటీలో ఇలా పట్టపగలు, రాత్రికి రాత్రి తట్టలూ, కట్టెలూ అర్ధనగ్నంగా మోస్తుంటే స్త్రీ జాతికి ఎంత పురోభివృద్ధి! ఏమిటో ఈ ఆలోచనలు వేపకాయల్లా గొంతు కడ్డంపడ్డ వెలక్కాయల్లా వెగటుగా, వగరుగా వున్నాయ్. నిజంగా ఆలోచించకూడదు. ఆలోచిస్తే ఏ పనీ చేయలేం. తలకాయని తల దువ్వుకోవడానికి, స్నో-పౌడర్ రాసుకోటానికి, మగాళ్ళైతే గడ్డం గీసుకోటానికి ఉపయోగించాలి. ఆలోచించకూడదు. కళ్ళతో టెన్నిస్ చూడాలి. చెవులతో క్రికెట్ కామెంటరీ వినాలి. ఆలోచించకూడదు. ఆలోచన భయంకరం. ఏమిటీ? ఈ రక్తం చూసినప్పటి నుంచి మనసు మరీ చికాకుగా వుంది. ఇలాంటి ఆలోచనలు ఇదివరకెన్నడూ రాలేదే. లోకం ఆలోచన నేర్పుతుందేమో! నేను చదువుకున్న కాన్వెంట్ ఎందుకు నేర్పలేదు?

టానియా ఒక్కసారి ఉలిక్కిపడింది పిడుగు పడ్డట్టు కెవ్వున కేక!

"ఓలమ్మో, మెల్ల కద్దుగా యెందుకు దిగావు? నా కొండో, నా కొండో! తిరుపతి పడిపోయినాది. లగెత్తుకురా! ఏళ్ళనన్నా లేపుకురా," అంటూ లబోదిబో మంది అప్పలమ్మ.

టానియా డ్రాప్ ఎత్తటానికి పరిగెట్టేటంత వేగంగా వెళ్ళింది. అవును, ఇందాక రక్తం కక్కుతున్న తిరపతే - ఆ తిరపతే! టెన్నిస్ రాకెట్ ఖరీదు కూడా చేయని తిరపతి - పరపతిలేని తిరపతి!

తిరపతి తలనిండా రక్తం.

తలలో రక్తం.



త్రివేంద్రంలోని తెలుగు సాంస్కృతిక సంఘంవారు ఇటీవల ప్రదర్శించిన 'పెళ్ళి సందడి' నాటకం నుంచి ఒక దృశ్యం

రక్తంలో తల.

తిరపతి గుడ్లగూబలా మూల్గుతోంది. గాలిలా యేడుస్తోంది. మాస్తూండగానే తిరపతి చేతిలో తట్టని గుప్పిటతో గట్టిగా బిగించి ఒదిలింది.

ఆ దృశ్యం చూసిన టానియా కెరటంలేని సముద్రంలా, ఆకు కదలని చెట్టులా, మబ్బులాడని ఆకాశంలా, మనసులేని మనిషిలా, జీవంలేని శవంలా వచ్చి బెడ్ మీద పడుకుందిగాని, నిద్రపోడానికి రెప్పల్లేవు. రెప్పలు తిరపతి కళ్ళు మూసినచోట వొదిలేసింది.

తెల్లవారింది. తెల్లవారక తప్పదు. సూర్యుడు డ్యూటీ ఛార్జి తీసుకున్నాడు. టానియా బాత్‌రూమ్‌లో వుండగా బైట మాటలు అస్పష్టంగా వినబడుతున్నాయి.

"అ , ఏమీ లేదు. రాత్రి ఎవరో పనిమనిషి గుండె జబ్బుతో చచ్చిపోయిందిట, దిక్కులేని పిల్లను ఒదిలేసి. ఆ పిల్లకేమైనా సాయం చేయాలంటుంటే రేపు రమ్మంటున్నాను. ఈవాళ ఫైనల్స్ గదా! ఈ గొడవలో వున్నాను."

అంతలో రేడియో సిలోన్ ఆ మాటల్ని మింగేసింది.

బైట ఎవరిదో కారు హారన్! ఇన్-గేటు! అవుట్-గేటు వాటి పని అవి చూసుకొంటున్నాయ్. యూనివర్సిటీ మూసేయలేదు. క్లాసులు మామూలుగానే జరుగుతున్నాయి. మధ్యాహ్నం మాత్రం సెలవ్.

తిరపతి చచ్చిపోయినందుకు కాదు—టానియా ఆట చూడటానికి.

ఆఖరు రోజు, ఎండ మంటలా వుంది. ఆర్గనైజర్స్ హడావుడి. చోటుకోసం లాస్ట్ అవర్ ఎగ్గొట్టేవాళ్ళ హడావుడి పోటీపడుతున్నట్టుంది. పబ్లిక్ రిలేషన్స్‌వాళ్ళు పిక్చరైజ్ చెయ్యటానికొచ్చారు. టౌన్‌లో స్కూళ్ళకు, కాలేజీలకు, ఆఫీసులకు పండుగ. మళ్ళా మామూలే. టెన్నిస్ కోర్టు, కార్లు, స్కూటర్లు, కళ్ళజోళ్ళు,



సైకిళ్ళూ, కోట్లు, చీరలు, బ్లౌజులు, పోజులు, జనం, జనం, జనం, నిశితంగా చూస్తున్నాయ్ కళ్ళు కళ్ళు కళ్ళు. మళ్ళా లా కాలేజీ రంగురంగుల జనాన్ని టోపీగా పెట్టుకుంది. ఎత్తు తక్కువగా వున్న కేంటీన్, ఎన్.సి.సి. ఆఫీసు మేచ్ చూడలేక సిగ్గుతో తల వంచుకున్నట్టున్నయ్. కారు డ్రైవర్లు సిగరెట్టు కాలుస్తూ కష్టం సుఖం చెప్పు కుంటున్నారు.

టానియా శరీరం ఆడుతోంది. హృదయంలో సైగల్ గొంతులో విషాద ఘోషలా వుంది. అంపైర్ ప్రతీ కదలికను అతి జాగ్రత్తగా చూస్తున్నాడు. టానియా చికాగ్గా ఆడుతోంది. మొదటి సెట్టు ఎదుటి పక్షం తీసుకుంది.

టానియా — కొట్టు.
టానియా — బీ కేర్‌ఫుల్.
టానియా — డోన్ట్ వర్రీ.

ఎంకరేజ్‌మెంటు ఆకాశంలా విరిగిపడుతూంది.

టానియా చేసిన సర్వీసులు ఫెయిలవుతున్నయ్. అంపైర్ ఫాల్టు. ఫాల్టులతో జనం విసుగెత్తిపోతున్నారు. లా కాలేజి పై నుంచి ఆట చూస్తున్న అమ్మాయి తేలుకుట్టినంత బాధగా చెయ్యి విదిలించుకొంటోంది. అంపైర్ 'డ్యూస్' అన్నాడు.

'ఐ డోన్ట్ వాంట్ డ్యూస్' 'లా' కాలేజీపై అమ్మాయి గట్టిగా అరిచింది. ఆ అరుపులు వినే పరిస్థితిలో లేరు జనం. ఎవరి లోకంలో వారే అరుస్తున్నారు.

టానియాకు చాలా చికాకుగా వుంది. తిరపతి కక్కుకున్న రక్తంలా కళ్ళ ముందు ఎండ మెరుస్తోంది. టానియాకు గట్టిగా మైకులో ఎనౌన్స్‌మెంటు చేయాలనిపించింది. ఆ రోజు ఆట ఆపేయాలనిపించింది. తిరపతి చావుకు సంతాపసూచకంగా జనాన్నంతటినీ ఓ అరగంట నిశ్శబ్దంగా నిలబెట్టాలనిపించింది.

జనం ... ... జనం. సముద్రపొడ్డు ఇసకలా. ఈ దేశంలో దారిద్ర్యంలా.

టానియా చూపు రాత్రి తిరపతి చచ్చిపోయిన చోటుపై పడింది. అక్కడ కార్పెట్‌పై జనం, ఆడటానికి కాదు, చూడటానికి.

టానియాకి జనం మీద కోపం వచ్చింది. ఆ కోపం బాల్ మీద చూపించింది. రెండో సెట్టు తను నెగ్గింది.

మూడో సెట్టుకు మనసు మళ్ళా తక్కెడలా ఊగుతూంది. మూడో సెట్టులో అయిదు గేములు అవతలి అమ్మాయి తీసుకుంది. టానియా మళ్ళా చిరుతపులి అయిపోయింది. వరసగా అయిదు గేములు లాక్కుంది.

జనం కుర్చీల మీద లేరు. సిక్స్త్ గేమ్‌లో సర్వీసు చేయగానే మళ్ళా ఫాల్టు అన్నాడు అంపైరు. టానియాకు ఆట మానేసి ఎక్కడన్నా ఏకాంతంగా కూర్చోవాలనిపిస్తోంది.

'అంపైర్! నేను కొట్టిన బాల్ కాదు. ఈ లోకం ఫాల్టు, ఈ జనం ఫాల్టు, వీళ్ళ తెలివి ఫెయిల్-వీళ్ళకార్లు ఫెయిల్- వీళ్ళంతా ఫెయిల్ ఫెయిల్' అని అరవాలనిపించింది. నిద్రలేక కళ్ళు బరువుగా వున్నాయి.


తిరపతి — తల బద్దలైపోయిన తిరపతి — తను మోయలేని తట్టలు మోస్తున్న తిరపతి. తిరపతి చావు నెవరూ పట్టించుకోరే! వీళ్ళంతా ఫెయిల్. వీళ్ళ కోట్లు ఫెయిల్. వీళ్ళ కార్లు ఫెయిల్. ఆ లా కాలేజి ఫెయిల్. వీళ్ళంతా ఫెయిల్ ఫెయిల్.

టానియా నిర్లక్ష్యానికి నుదుటిమీద టెన్నిస్ బాల్ గట్టిగా కసి తీర్చుకుంది. చిన్న బొప్పి కట్టటంతోబాటు కొంచెం పక్కకువాలింది. రాత్రి నిద్రలేక కళ్ళు తిరుగుతున్నాయి. అంతే, జనం సముద్రంలో టానియాను పైకెత్తారు. చేతులపై ఫేకల్టీ క్లబ్‌లోకి తీసుకుపోయారు. ఆ లాడ్జి చుట్టూ జనం.

'నెవర్ మైండ్, ఐయామ్ ·ఆల్‌రైట్.' అంది టానియా తెచ్చిపెట్టుకున్న నవ్వుతో. కోట్లకు, కార్లకు, గొట్టం పేంట్లకు ఆదుర్దా. డాక్టర్లు సిరంజిలు సరిచేసుకొంటున్నారు. టానియాకు ఏడుపులాంటి నవ్వొచ్చింది. తనకేం కాలేదంటే వినరే. జరిగిందంతా తిరపతికి. మట్టి తట్ట చేత్తో గట్టిగా పట్టుకొని చచ్చిపోయిన తిరపతికి, దిక్కులేని ఆమె పిల్లకు. ఎవరూ వినిపించుకోరేం? వీళ్ళంతా నిజంగా ఫెయిల్. వీళ్ళ అభిమాన ప్రవాహం సముద్రంలాంటి మట్టి తట్టలవైపు ప్రవహించడం మానేసి ఈ టానియా లాంటి నగరాలపై పడడం నిజంగా అసలైన ఫాల్! ఫెయిల్ ఫెయిల్!

చుట్టూ చూట్టం మానేసి టానియా సైలెంట్‌గా గోడ గడియారం వైపు చూస్తూ ఆలోచిస్తూంది. ఎన్నో రహస్యాల్ని, సత్యాల్ని దాచుకున్న గడియారం తాపీగా ముందుకు నడుస్తోంది.

('ఎమెస్కో' ప్రచురణ, విద్యార్థి సాహితి—1 సౌజన్యంతో)




## ఆ గాయకురాలు

ఆమె కంఠనాళ స్పందనా జనిత
వాయుతరంగములు డోలలూగించు నన్ను
నా శ్రవణ పుటముల జొచ్చి
గిలిగింఛి కులికించు నన్ను.

నా భావనాలయమున జ్యోతులు వెలిగించి
నన్ను కరగించి కదిలించి
మరపించి వలపించి
పులకించి పునీతు వేయు

ఎన్ని మేఘాల ఫెళ ఫెళార్భాటాలు
ఎన్ని కోయిల తీయందనాలు
ఎన్ని సెలయేటి గళగళారావాలు
ఎన్ని వెలలేని రాగానురాగాలు

అది గంధర్వ మధుర గాన స్రవంతియో
అది మారుతామందిత పారిజాత హాస విలాసమో
అది గగనతారకా పద నినాదమో
అది పాంచజన్య జనిత ఓంకారమో.

ఆమె మధురగాన శ్రవణానుభూతివలన
మదిర పాన తన్మయత్వమ్ము కలుగునాకు
వింధ్య పర్వతారోహణా సంతృప్తి కలుగు నాకు
సంధ్య నగ్న సౌందర్య దర్శనా విభ్రాంతి కలుగు నాకు

ఆమె సృజియించు శబ్దతరంగాలు
యుగయుగాంతరాల జగజగాంతరాళ
నాదబ్రహ్మ నవమందనాలు నాకు
ఆ గొంతు వింత నా పరమార్థమింత.

—డాక్టర్ డి.ఎ.ఎ.ఎస్. నారాయణరావు, హ్యూస్టన్